క్లుప్తంగా

ఎమ్మెల్సీ బొత్స పరామర్శ



కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు

ఎచ్చెర్ల: లావేరు మండలం చిన్నమురపాకలో వైఎస్సార్ సీపీ నాయకుడు సిరిపురం అయ్యప్పలనాయుడు ఇటీవల మృతిచెందిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న శాసనమండలి సభ్యుడు బొత్స సత్యనారాయణ, విజయనగరం మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్‌లు ఆదివారం ఎంపీటీసీ సిరిపురపు రాంబాబు కుటుంబాన్ని పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



రాగోలులో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని రాగోలు, గూడెం, వాకలవలస, లంకాం, ఒప్పంగి, సానివాడ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గొండు శంకర్ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ అవసరాలకు తగిన నిధులు మంజూరు చేసి సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, నీటి సంరక్షణ స్ట్రెంచర్లు, డ్రైనేజీలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. వారం రోజుల పాటు పల్లెపండుగ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణ



మొండేటివీధిలో అన్నదానం

శ్రీకాకుళం కల్చరల్ : నగరంలోని మొండేటివీధిలో లక్ష్మీ గణపతి ఆలయ వార్షికోత్సవం, లలితాదేవి అమ్మవారి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం అన్నదానం నిర్వహించారు. షిరిడీసాయి సేవా సంఘం ఆధ్వర్యంలో 3 వేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. నానుబాల వీధిలోని విజయదుర్గ అమ్మవారి ఆలయం వద్ద కూడా దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా అన్నదానం నిర్వహించారు.

సిరిమాను ఉత్సవాలకు శ్రీకారం



సమావేశంలో మాట్లాడుతున్న డి.పి.దేవ్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): శ్రీశయన కుల సిరిమాను ఉత్సవాన్ని సోమవారం నుంచి ప్రారంభించనున్నట్లు గ్రామ దేవతల సిరిమాను ఉత్సవ కమిటీ అధ్యక్షుడు డి.పి.దేవ్ తెలిపారు. ఆదివారం గురిటి పోలమ్మ గుడి వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం నగరంలో ఒకటో ఖండం దేశల్లావారివీధి నుంచి టీపీఎం హెచ్ స్కూల్ వరకు, రెండో ఖండం కలెక్టర్ బంగ్లా వరకు, మూడో ఖండం పొన్నాడ వంతెన మీదుగా కునుకుపేట వరకు వెళ్తుందని చెప్పారు. దీనిలో భాగంగా చింత, వేప చెట్లకు బొట్లు పెట్టే కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సంఘ నాయకులు మావూరు శేఖరరావు, కల్లేపల్లి సోమనాథ్, నక్క శంకరరావు పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యంపై ఫిర్యాదు



తేజేశ్వరరావు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని కాళింగ మన్నయ్యపేటకు చెందిన 15 ఏళ్ల బాలుడు పైడి తేజేశ్వరరావు ఈ నెల 16 నుంచి కనిపించడం లేదని తండ్రి పోలినాయుడు ఆదివారం శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలు తెలిసిన వారు రూరల్ పోలీస్‌స్టేషన్(6309990845)లో సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

తుఫాన్ షెల్టర్ల పరిశీలన



పాతదిబ్బలపాలెంలో షెల్టర్‌ను పరిశీలిస్తున్న పీడీ

ఎచ్చెర్ల క్యాంపస్: తుఫాన్ షెల్టర్ల నిర్వహణ పక్కాగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సుధాకర్‌రావు అన్నారు. పాతదిబ్బలపాలెం, బొంతలకోడూరు గ్రామాల్లోని తుఫాన్ షెల్టర్లను ఆదివారం పరిశీలించారు. తుఫాన్లు, విపత్తులు, అత్యవసర సమయాల్లో ప్రజలు ఉండేందుకు అనువుగా భవనాలలో సాకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా డ్రైనేజీ



చిలకపాలెం వీధుల్లో డ్రైనేజీలు చెత్తతో నిండిపోయాయి. కాలువల్లోని చెత్త బయటకు వస్తోంది. దీంతో దుర్వాసన వెదజల్లి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

మోటార్లు మాయం



మోటార్ల చోరీలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. ఎచ్చెర్లలో గృహనిర్మాణ నిర్వహిస్తున్న నిర్మిత కేంద్రంలో సిమెంట్ ఇటుకలు తయారీ యంత్రాలు ఉన్నాయి. ఇక్కడి యంత్రాలకు మోటార్లు ఉన్నాయి. ఇవి తరచూ చోరీకి గురవుతున్నాయి. యంత్రానికి ఉన్న మోటారును తొలగించిన దృశ్యం ఇక్కడ చూడొచ్చు.

– ఎచ్చెర్ల క్యాంపస్

అలా వదిలేశారు



గతంలో తహశీల్దార్లు వినియోగించిన వాహనాలు మూలకు చేరాయి. వాస్తవానికి 15 ఏళ్లు దాటిన ప్రభుత్వ వాహనాలు టెండర్లు పిలిచి అమ్మేయాలి. ప్రస్తుతం ఎచ్చెర్ల తహశీల్దార్ కార్యాలయంలో పాత వాహనం తుప్పు పట్టిపోయింది. స్క్రాప్‌కు కూడా పనికి రాని విధంగా తయారైంది.

– ఎచ్చెర్ల క్యాంపస్

అధ్వాన రోడ్డుతో అవస్థలు



ఎచ్చెర్ల జాతీయ రహదారి నుంచి ఆర్టీవో కార్యాలయానికి వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. రాళ్లు తేలి బురదమయంగా మారడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ రోడ్డుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

– ఎచ్చెర్ల

కాలువ నీరు కలేనా?

- మడ్డువలస కాలువ ద్వారా అందని సాగునీరు
- కరుణించని వరుణుడు
- ఎండిపోతున్న వరి పొలాలు
- జి.సిగడాం మండలంలో 7500 ఎకరాలపై ప్రభావం



దేవరవలస గ్రామం వద్ద మడ్డువలస కాలువ దుస్థితి

జి.సిగడాం: వరుణుడు కరుణించకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. సాగునీటి కాలువల ద్వారా నీరు రాకపోవడంతో కళ్ల ముందే పంటలు ఎండిపోయే దశను చూస్తూ తల్లడిల్లిపోతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొస్తున్న సమయంలో ఎండి పోవడంతో రైతన్నలు గగ్గోలు పెడుతున్నారు. ప్రధానంగా మడ్డువలస ప్రధాన కాలువ ద్వారా సాగునీరు అందకపోవడంతో జి.సిగడాం మండలంలో సుమారు 7,500 ఎకరాల పంట భూములు ఎండిపోతున్నాయి. వాండ్రంగి, ఆనందపురం, సంతవురిటి, ధవలపేట, పెంట, సీతంపేట, టిడివలస, పాలఖండ్యాం, మెట్టవలస, నిద్దాం గ్రామాలకు ఇప్పటి వరకు కాలువ ద్వారా నీరు రాలేదు. గతంలో వర్షాలు కురిసినప్పుడు వరినాట్లు వేశారు. దేవరవలస మంగమ్మపేట పంట పొలాలకు కాలువ బాగా లోతుగా ఉండటంతో రెండు దశాబ్దాలుగా సాగునీరు అందడం లేదు. సుమారు రెండు నెలలుగా వర్షాల జాడ లేకపోవడంతో రైతన్నలు చుక్కనీటి కోసం పాట్లు పడుతున్నారు. ప్రధాన కాలువ కింద పొలాలన్నీ బీటలు వారుతుండటంతో ఆందోళన చెందుతున్నారు.



సంతవురిటి గ్రామంలో ఎండిపోయిన వరి పంట

పట్టించుకోలేదు..



కాలువలు ద్వారా సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నాం. సాగునీటి కాలువను నమ్ముకుని సాగు చేస్తే కష్టాలు తప్పడంలేదు. మడ్డువలస కాలువ ద్వారా సాగునీరు అందించాలని ఉన్నత అధికారులకు వినతులు అందించినా పట్టించుకోలేదు.

– మక్క శ్రీనివాసరావు, రైతు, పెంట గ్రామం

ఈ ఏడాది కష్టమే..



మడ్డువలస కాలువ ద్వారా సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నాం. 39 ఎల్ వద్ద దోణి నిర్మాణం చేపట్టాలని ఎన్ని వినతులు ఇచ్చినా ఎవ్వరూ పట్టించుకోలేదు.ఈ ఏడాది పంట చేతికి రావడం కష్టమే..

– వడిశ మహేశ్వరరావు, రైతు, విజయరాంపురం



విజయరాంపురంలో బీటలు వాలిన వరి పొలాలు

ఆదిత్యుని సన్నిధికి భక్తుల తాకిడి



దర్శనాలకు వస్తున్న భక్తులు

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో ఆదివారం వందలాది మంది భక్తులు తరలివచ్చారు. ప్రత్యేక ఆదివారం కావడంతో ఆరోగ్యం కోసం సూర్యనమస్కారాల పూజలు చేయించుకున్నారు. అంతరాలయంలో ప్రత్యేక అలంకరణలో ఆదిత్యుని మూలవిరాట్టును ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో సర్వదర్శనాలకు అనుమతించారు. భక్తులకు దర్శనాల్లో ఎక్కడా ఇబ్బందులు లేకుండా ఆలయ ఈవో వై.భద్రాజీ ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఉచిత మంచి నీరు, ప్రసాదాలను పంపిణీ చేయించారు. కేశఖండన శాలలో భక్తులు తలనీలాలను సమర్పించి మొక్కులు చెల్లించారు. సుమారు 600 మంది భక్తులు అన్నదాన ప్రసాదాలను స్వీకరించారు. కేశఖండనశాల, ప్రసాదాల తయారీ, అన్నదాన విభాగాలను ఈవో భద్రాజీతో కలిసి సూపరింటెండెంట్ కనకరాజు పరిశీలించి తగు సూచనలు చేశారు. కాగా, వివిధ ప్రాంతాల్లో ఉన్న భక్తుల వాహనాలు పార్కింగ్ విషయంలో ఇబ్బందులు పడ్డారు. ప్రధాన రోడ్డుపై వాహనాల రద్దీ పెరగడంతో భక్తుల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి.

దేవాంగుల సంక్షేమమే ధ్యేయం



మాట్లాడుతున్న సంఘ అధ్యక్షుడు వీరభద్రరావు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): నిరుపేద దేవాంగులకు ఆర్థికంగా సాయం చేసి చేయూతనివ్వడమే సంఘం ధ్యేయమని శ్రీకాకుళం పట్టణ దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుంటముక్కల వీరభద్రరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలో గురిటిపోలమ్మ ఆలయ ఆవరణలో ఆదివారం నూతన కార్యవర్గం ఎన్నిక, సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం ఆవిర్భావం నుంచి పలు హోదాల్లో ఉన్న నల్ల హైమావతి, ఉట్ల వామనరావు లేకపోవడం బాధాకరమన్నారు. సమావేశంలో సంఘ నాయకులు నల్ల అప్పారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన ఎన్నికలో సంఘ అధ్యక్షుడిగా గుంటముక్కల వీరభద్రరావు, ప్రధాన కార్యదర్శిగా కాశిన సూర్యప్రసాదరావు, కోశాధికారిగా తూతిక గణపతిరావు, మరో 12మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

చోరీ కేసుల నిందితులపై సస్పెక్ట్ షీట్లు



మాట్లాడుతున్న డీఎస్పీ వివేకానంద

శ్రీకాకుళం క్రైమ్ : చోరీ కేసుల్లో ఉన్న వారిపై సస్పెక్ట్ షీట్లు తెరుస్తున్నామని శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద తెలిపారు. ఆదివారం సబ్‌డివిజన్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సస్పెక్ట్‌షీట్స్ ఉన్న వారి కదలికలపై నైట్ బీట్ బృందాలు నిఘా ఉంచుతాయని చెప్పారు. ఆదివారం చోరీ కేసులో పట్టుబడిన కమల్‌నాథ్‌పై విశాఖపట్నంలో షీట్ ఉందని పేర్కొన్నారు. ఫైనాన్స్, కన్సల్టెన్సీ సంస్థల నిర్వాహకులు తమకు వద్దకు ఆభరణాలు కుదువ పెట్టేవారు వచ్చేటప్పుడు జాగ్రత్తలు వహించాలని, డాక్యుమెంటేషన్ పక్కాగా ఉండేలా చూసుకోవాలని, చిరునామా, ఐడీ ప్రూఫ్ పరిశీలించాలని చెప్పారు. తరచూ ఒకే వ్యక్తి(నిందితుడు) నుంచి బంగారం తనఖా పెట్టుకుంటే సంస్థపైనా కేసులు (411 సెక్షన్) నమోదు చేస్తామని హెచ్చరించారు.

వైభవంగా సత్యసాయి అవతార దినోత్సవం



శ్రీకాకుళం కల్చరల్ : సత్యసాయి చిత్రపటంతో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు



జి.సిగడాం: ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: సత్యసాయి బాబా అవతార ప్రకటన దినోత్సవం నగరంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్ వద్దకు 200 మందిరాలకు చెందిన సాయి భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యసాయి తన అవతార ప్రకటనను 1940 అక్టోబరు 20న ప్రకటించారని, నాటి నుంచి ప్రతి ఏడాది అవతార దినోత్సవం నిర్వహిస్తున్నామని చెప్పారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాముగరిడి, కోలాటం, డప్పువాయిద్య, తప్పెటగుళ్ల కళాప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పూర్వ అధ్యక్షుడు గంగుల రమణబాబు, సేవాదళ్ కో–ఆర్డినేటర్ పప్పల నాగేశ్వరరావు, స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి బోయిన నరసింహమూర్తి, స్పిరిట్యువల్ కో–ఆర్డినేటర్ అనాధ గుప్త, పెద్ద మందిరం కన్వీనర్ మురళీ, హయాతినగరం ప్రతినిధి కిల్లాన ఫల్గుణరావు, బ్యాంకర్స్ కాలని కన్వీనర్ ప్రసాద్, సత్యం శివం సుందరం మందిరం కన్వీనర్ నాగభూషణ్, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

జి.సిగడాం: మండల కేంద్రం జి.సిగడాంలో సత్యసాయిబాబా అవతార ప్రకటన ఉత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. సత్యసాయిబాబా చిత్రపటాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక ప్రవచనం



నర్సింగరావును సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని ఉపనిషన్మందిరంలో ఆదివారం 'లలిత స్కంధం పిబత భాగవతం' అనే అంశంపై మేడూరి నర్సింగరావు ప్రసంగించారు. లలితాదేవి అమ్మవారి అవతరణ విశేషాలను వివరించారు. అనంతరం వక్తను మందిరం సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పి.పతంజలిశాస్త్రి, ఎం.వెంకటరమణ, ఎస్.నరసింహమూర్తి, ఎస్.కృష్ణారావు, టి.తవుడు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మోక్షం



ప్రసంగిస్తున్న లక్ష్మీపతి గౌర్‌దాస్

శ్రీకాకుళం కల్చరల్: ఆధ్యాత్మికత బాటలో నడిచినప్పుడే భగవంతున్ని చేరుకోగలమని ఇస్కాన్ ప్రతినిధి లక్ష్మీపతి గౌర్‌దాస్ అన్నారు. పొన్నాడ బ్రిడ్జి వద్ద ఇస్కాన్ మందిరంలో ఆదివారం ప్రవచనం ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ సేవ చేయడానికే వచ్చామని అన్నారు. అనంతరం జిల్లా పరిషత్ నుంచి 200 మంది భక్తుల భజనలతో ఊరేగింపు చేపట్టారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది.

ముగిసిన జిల్లా స్థాయి నాటిక పోటీలు



కెరటాలు నాటికలోని ఓ సన్నివేశం



బహుమతులు అందుకుంటున్న కళాకారులు



చిన్నారావును సత్కరిస్తున్న నిర్వాహకులు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక బాపూజీ కళామందిర్‌లో సూత్రా ఫౌండేషన్, సుమిత్రా కళాసమితి సంయుక్త నిర్వహణలో జిల్లా స్థాయి నాటిక పోటీలు ఆదివారంతో ముగిశాయి. రాజాంకు చెందిన కళా క్రియేషన్స్ 'కెరటాలు', పాగిరికి చెందిన రసధ్వని గ్రామీణ సాంస్కృతి 'సప్తమ సూత్రం' నాటికలు ఆద్యంతం అలరించాయి. అనంతరం రంగస్థల, టీవీ, సినీ నటులు కలగ గణేష్‌యాదవ్, గుత్తు చిన్నారావు, బొల్ల లలితారాణిల ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సుమిత్రా కళాసమితి అధ్యక్షులు ఇప్పిలి శంకరశర్మ, సూత్రాఫౌండేషన్ అధ్యక్షుడు నిక్కు హరిసత్యనారాయణ, డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు, డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు, కార్యదర్శి గుత్తు చిన్నారావు, ఆర్ట్స్ సంస్థ ప్రతినిధి సన్యాసిరావు, ఉపాధ్యక్షులు మండవిల్లి రవి, కిల్లాన ఫల్గుణరావు, కొమనాపల్లి సురేష్, మూర్తి, రంగస్థల కళాకారుల సమాఖ్య సభ్యులు చిట్టి వేంకటరావు, పన్నాల నరసింహమూర్తి, ఎల్.రామలింగస్వామి, రామచంద్రదేవ్ పాల్గొన్నారు.

ఉత్తమ నాటికగా 'నిర్జీవ నినాదం'

ఉత్తమ నాటిక ప్రదర్శనగా బొరివంకకు చెందిన శార్వాణి గ్రామీణ గిరిజన సాంస్కృతిక సేవా సంఘం ప్రదర్శించిన 'నిర్జీవ నినాదం', ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా పాగిరికి చెందిన 'సప్తమ సూత్రం', తృతీయ ఉత్తమ ప్రదర్శనగా పెదమేరంగికి చెందిక 'కొండగాలి' నాటికలు నిలిచాయి. ఉత్తమ నటులుగా చలపతిరావు, శ్రీనివాసరావు, నటీమణులుగా జ్యోతి, జి.లలితారాణి, దర్శకుడిగా బీఎంఎస్ పట్నాయిక్, రచనగా శ్రీస్నిగ్ధ, ప్రతినాయకుడిగా ఎస్.సర్వేశ్వరరావు, ఆహార్యం, రంగాలంకరణలో రమణారావు, సంగీతంలో పి.లీలామోహన్ అవార్డులు అందుకున్నారు. దూసి అనూరాధ, పి.మణిబాల, డి.హేమవెంకటేశ్వరి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

ముగిసిన నేషనల్ ఫిజియోథెరపి కాన్ఫరెన్స్



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

శ్రీకాకుళం రూరల్ : రాగోలు జెమ్స్‌లో మూడు రోజులుగా జరుగుతున్న నేషనల్ ఫిజియోథెరపి కాన్ఫరెన్స్ ఆదివారంతో ముగిసింది. స్పోర్ట్స్, అకడమిక్ ఈవెంట్లకు సంబంధించి పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ముంబై, హైదరాబాద్, చెన్నై నుంచి విచ్చేసిన ఫిజియోథెరపిస్టులు తమ అనుభవాలను, చికిత్స విధానాలను విద్యార్థులతో పంచుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎ.వెంకటరమణ, డాక్టర్ దేవేంద్రనాథ్, ముంబైలోని టాటా మెమోరియల్ ఆసుపత్రి ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గౌరమ్మ ఉత్సవాలు



జొన్నలపాడులో ఆకట్టుకున్న వేషధారణలు



పూజలందుకుంటున్న నందెన్న

గార: మండలంలోని జొన్నలపాడు గ్రామంలో 11 రోజుల పాటు నిర్వహించనున్న గౌరీ ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆదివారం సాయంత్రం నందెన్న తిరువీధి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. మంగళవాయిద్యాల నడుమ పూజలు చేసి హారతులు పట్టారు. ఈ సందర్భంగా స్థానికులు వేసిన రాముడు, సీత, లక్ష్మణుడు, హనుమంతుడు, రావణాసురుడు, కాలకేయుడు వంటి వేషధారణలు అలరించాయి. బందరువానిపేటలోనూ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.